పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- కేంద్రాల వద్ద వెబ్ క్యాస్టింగ్
- అన్ని కేంద్రాల వద్ద కనీస సౌకర్యాల ఏర్పాటు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవినాయక్



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రవినాయక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకొని క్యూలైన్‌లో ఉన్న వారందరికి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశముందన్నారు. ఇప్పటికే 95 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయినట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డులలో దేనినైనా చూపించి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,82,470 మంది ఓటర్లు, 1,239 మంది సర్వీస్ ఓటర్లు ఉండగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1937 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 937 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 214 మంది సెక్టార్‌ల పరిధిలోని సెక్టార్ ఆఫీసర్ల ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నియమాల ప్రకారం వాహనాల తనిఖీల్లో రూ.2.46 కోట్ల నగదు, రూ.1.81 కోట్ల విలువ చేసే 45,069 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. అందులో ఆధారాలు చూపిన రూ.2.19 కోట్ల డబ్బును రిలీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 31 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని రెండు బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేసి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు. పోలింగ్‌కు 72 గంటల ముందు నుంచే అంతర్ జిల్లా చెక్‌పోస్టులను మరింత యాక్టివ్ చేసినట్లు తెలిపారు. 48 గంటల ముందు నుంచి సైలెన్స్ పీరియడ్‌లో అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులోకి వచ్చినట్లు వివరించారు. శనివారం సాయంత్రం 6 గంటల తర్వాత అన్ని ప్రచారాలు, లౌడ్‌స్పీకర్లు నిషేధించినట్లు తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్ మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని, సైలెన్స్ పీరియడ్‌లో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. పార్లమెంటు పరిధిలో మొత్తం 881 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించి ఐటీబీపీ సెంట్రల్ ఫోర్స్ ద్వారా భద్రత కల్పించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే హెల్ప్‌లైన్ 08542–1950 నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చన్నారు.

మూడో ర్యాండమైజేషన్ పూర్తి

పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో భాగంగా కేంద్రం ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా సమక్షంలో పోలింగ్ సిబ్బంది మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్ఐసీ సమావేశ మందిరంలో ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్, నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అదేవిధంగా నారాయణపేట, మక్తల్, నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ నిర్వహించి పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐసీడీఐఓ ఎమ్.ఎస్‌మూర్తి, మ్యాన్‌పవర్ నోడల్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

పీయూలో కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన..

పాలమూరు యూనివర్సిటీ లో ఏర్పాటు చేస్తున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు పనులను ఎన్నికల సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవి నాయక్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పలు సూచనలు చేశారు. లెక్కింపు టేబుళ్ల కూర్పు, అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల ప్రవేశం, ఈవీఎం కదలికలపై సూచనలు ఇచ్చారు. ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి పరిశీలకులకు వివరించారు. అదేవిధంగా ఎన్నికల ఏర్పాట్లలో బాగంగా మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్‌లు శనివారం పరిశీలించారు. ఆదివారం పంపిణీ చేయనున్న మెటీరియల్ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.


పీయూలో కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సాధారణ ఎన్నికల పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా

పాలమూరులో భారీ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు సర్వతోముఖాభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిని సొంత గడ్డలో దెబ్బతీయడానికి బీఆర్ఎస్, బీజేపీ ఏకమై ఢిల్లీ నుంచి వచ్చిన డబ్బులు, సారాను ఏరులై పారించే ప్రణాళికలు రూపొందించినట్లు విమర్శించారు. పాలమూరు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడేలా గద్వాల రౌడీలు ఇక్కడ తిష్టవేసి డబ్బులు, సారా పంపిణీ కోసం వచ్చారని తెలిపారు. ఈ రౌడీలు పాలమూరులోని ఏ ప్రాంతాల్లో ఎవరెవరు, ఎక్కడ ఉన్నారో తన వద్ద ఖచ్చితమైన ఆధారాలు ఉన్నాయని, వాటన్నింటిని ఎన్నికల అధికారికి సమర్పించనున్నట్లు తెలిపారు. పాలమూరు ప్రజలు స్వేచ్ఛ శాంతిని, ఇప్పుడిప్పుడే పీల్చుకుంటున్న ఈ తరుణంలో గద్వాల రౌడీలు ఇక్కడికి వచ్చి అశాంతిని నెలకొల్పేందుకు కుట్రలు మొదలెట్టారని విమర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా, శాంతియుతంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి పాలమూరు అభివృద్ధి, భవిష్యత్ తరాల అభ్యున్నతి కోసం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల చివరి రోజు ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శనివారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టింది. మెట్టుగడ్డ నుంచి ఎర్రసత్యం చౌరస్తా వరకు నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం తదితరులు ప్రత్యేక వాహనంలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, నాయకులు వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

నారాయణపేట/జడ్చర్ల: ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి , ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డితో పేటలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్‌చైర్‌పర్సన్ గందే అనసూయ, వైస్‌చైర్మన్ హరినారాయణభట్టడ్, వేణుగోపాల్, కౌన్సిలర్ సలీం, శివారెడ్డి, గౌస్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. తనను గెలిపిస్తే జడ్చర్ల నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారం చివరి రోజున కావేరమ్మపేట, బాదేపల్లి నేతాజీ చౌరస్తాలలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో వారు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్‌షెల్టర్‌లోకి దూసుకెళ్లిన లారీ..

- ఇద్దరి దుర్మరణం,
- నలుగురికి తీవ్ర గాయాలు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి జిల్లా కేంద్రం మంజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రి సమీపంలోని బస్‌షెల్టర్‌లోకి శనివారం ఓ ఇసుక లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కాళేశ్వరం గోదావరి నుంచి హనుమకొండ వైపునకు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ (టీఎస్ 25టీ1314) అతి వేగంగా వచ్చి అదుపు తప్పి ఏరియా ఆసుపత్రి ఎదుట ఉన్న బస్‌షెల్టర్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా లక్ష్మీపురం గ్రామానికి చెందిన గవర మునలినాయుడు(24), మహబూబ్‌నగర్ జిల్లా నిజాంపూర్ గ్రామానికి చెందిన వాకిటి సత్యనారాయణ(30) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విజయనగరం జిల్లాకు చెందిన అప్పల నాయుడు, మంజూర్‌నగర్‌కు చెందిన మధుకర్‌రెడ్డి, కాల్వపల్లికి చెందిన చంద్రశేఖర్, బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన ప్రియాంకకు తీవ్ర గాయాలయ్యాయి. మృతులు ఓపెన్‌కాస్టులో ఎస్‌వీఈసీ కంపెనీలో డ్రైవర్, ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఓటు వేయడానికి తమతో పని చేసే కోట మురళి, అప్పలనాయుడిని ఆంధ్రప్రదేశ్‌కు పంపించే క్రమంలో వారిని బస్సు ఎక్కించేందుకు మృతులు బైక్‌లపై తీసుకొచ్చారు. వారిని బస్‌షెల్టర్‌లో దింపి బస్సు కోసం ఎదురుచూస్తున్న సమయంలో లారీ.. మృతువు రూపంలో ఇద్దరిని బలికొంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను జిల్లా ప్రధాన ఆసుపత్రిలో భద్రపరిచి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్ తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రస్తుతం దేశంలో ఉన్న నియంత పాలనను సాగనంపి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఉమ్మడి జిల్లా దైవ సేవకుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. పదేళ్లుగా బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల వల్ల ఏ విధమైన ఫలితాలు పొందలేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు క్రైస్తవుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్య ప్రసంగికులు ఆచార్య సిలువంటి క్రీస్తూ సందేశం ఇచ్చారు. పీపీ దేవదాస్ ప్రార్థనలు చేశారు. పాస్టర్ దాసరి శామ్యుల్, రాబర్ట్‌వెస్లీ, ఆగస్టిన్ స్తుతి ఆరాధన నడిపించారు. కార్యక్రమంలో దాసరి సుందర్, దాసరి శామ్యుల్, ఆర్.జాన్, హన్మంతురావు, అబ్రహం జాన్సన్‌పాల్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల తొలగింపు

హన్వాడ: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పంచాయతీ కార్మికులు ఈసీ ఆదేశాల మేరకు గోడలపై ఉన్న వాల్‌పోస్టర్‌లను శనివారం తొలగించారు. వేపూర్, గొండ్యాల్, తదితర ప్రాంతాల్లో కార్యక్రమం చేపట్టారు. కాగా ఎక్కడా పార్టీలకు సంబంధించిన పోస్టర్లు లేకుండా తొలగించేందుకు ఆదేశాలిచ్చారని సిబ్బంది వివరించారు.

టోర్నమెంట్ ప్రారంభం

గండేడ్: మండలపరిధిలోని సాలార్‌నగర్‌లో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. గ్రామంలోని అన్ని యువజన సంఘాల ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహిస్తున్నారు. ముదిరాజ్ సంఘం మండల ఉపాధ్యక్షుడు బంటు ఆంజనేయులు మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. క్రీడా పోటీల ద్వారా సత్సంబంధాలు మెరుగుపడుతాయన్నారు. గ్రామకమిటీ అధ్యక్షుడు నరేష్, సిద్ధార్థ, నరేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలి


ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం/జడ్చర్ల: : ఎన్నికల్లో ఈవీఎం తరలింపు నుంచి పోలింగ్ కేంద్రాల మళ్లీ ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడానికి బాధ్యతతో పని చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ సిబ్బందిని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల కోసం విధులు నిర్వహించడానికి వచ్చిన సీఐఎస్ఎఫ్ బలగాలకు జడ్చర్లలో, ఐటీబీపీ బలగాలకు స్వీట్స్ కళాశాలలో, సీఐడీ, కర్ణాటక పోలీస్ సిబ్బందికి షాలిమార్ ఫంక్షన్ హాలులో శనివారం జిల్లా ఎస్పీ వేరు వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ పట్ల, విధుల పట్ల, మొబైల్ పార్టీలతో పాటు పోలింగ్ సమయంపై పూర్తి అవగహన ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో 144సెక్షన్ ఉన్న నేపథ్యంలో వందమీటర్ల పరిధిలో ఎవరూ కూడా గుంపుగా ఉండకుండా చూడాలన్నారు. ప్రజలు క్యూలైన్ పాటిస్తూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చూడాలని సూచించారు. ప్రతి ఒక్క సిబ్బంది వారు విధులు నిర్వహించే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండే ఉన్నత అధికారుల నంబర్స్ ముందుగానే తీసుకోవాలన్నారు. రూట్ మొబైల్స్ సిబ్బంది రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్‌కేంద్రాల దగ్గర ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే దగ్గర్లో ఉన్న పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ప్రవర్తించే వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధుల్లో ఉండే సిబ్బంది, అధికారులు చుట్టు ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పూర్తి నిఘా పెట్టడంతో పాటు సరైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో శిక్షణ ఐపీఎస్ అధికారి చిత్తరంజన్, అదనపు ఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, సీఐడీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ అధికారులు, సీఐలు పాల్గొన్నారు.

ఫ్లాగ్‌మార్చ్: ప్రజల్లో ఎన్నికల్లో పట్ల ఆత్మ విశ్వాసం కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా పోలీస్ బలగాలతో పట్టణంలోనూ, జడ్చర్లలోనూ శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఫ్లాగ్‌మార్చ్‌లో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌తో పాటు ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాలు బంద్

మహబూబ్‌నగర్ క్రైం: ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధిలో 144సెక్షన్ అమల్లో ఉంటుందని, శనివారం సాయంత్రం 5గంటలతో అన్ని రకాల రాజకీయ ప్రచారాలు బంద్ అయ్యాయని, ఇకపై ఎవరూ ప్రచారం చేయరాదని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ ఒక ప్రకటనలో పేర్కొన్నార. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా, పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు ఏర్పాటు చేయరాదని తెలిపారు. ప్రధానంగా ధర్నాలు, రాస్తారోకోలు, బాణసంచా కాల్చడం చేయరాదని ఇలాంటి వాటిని నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తులపై ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దేవుళ్లకు వినతిపత్రాల సమర్పణ


ఎదిరలో బొడ్రాయికి వినతిపత్రం సమర్పిస్తున్న అమరరాజా పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి

మహబూబ్‌నగర్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు (ఎదిర) సమీపంలో ఏర్పాటు చేయతలపెట్టిన అమరరాజా బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటును అధికారులు విరమించుకునేలా అనుగ్రహించాలని కోరుతూ.. శనివారం ఆ వార్డు ప్రజలు, అమరరాజా బ్యాటరీ పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు కలిసి గ్రామ దేవీ, దేవతలు శ్రీ ఆంజనేయ స్వామి, శివలింగస్వామి, శ్రీ కోట మైసమ్మ, బొడ్రాయి, శ్రీ బంగారు మైసమ్మ, శ్రీశ్రీ బీరప్పస్వామి, బీసీ కాలనీలో ఆంజనేయస్వామి, బొడ్రాయి, శ్రీ పోచమ్మ దేవత, యేసుప్రభు, అల్లాహ్ దర్గాలలో వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ అమరరాజా బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటు వల్ల అనేక నష్టాలు సంభవిస్తాయని తెలిసే తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చినా కూడా అధికారులు స్పందించడం లేదని అన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు బి.శివశంకర్, నర్సిములు, వెంకటయ్యగౌడ్, ఎల్లయ్య, సుభాన్, బండారు శ్రీనివాసులు, రవీందర్, నాని, భానుచందర్, భాను, నాగరాజు, సత్యం, తిరుపతయ్య, అమర్నాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదగాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మనోహర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రికెట్ క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ వి.మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో హెచ్‌సీఏ సమ్మర్‌క్యాంప్‌లో భాగంగా శనివారం సీనియర్ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మనోహర్‌రెడ్డి పరిచయం చేసుకొని మాట్లాడారు. జిల్లా క్రికెట్ క్రీడాకారులు టోర్నీల్లో రాణిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. వేసవికాలంలో క్రికెట్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి శిక్షణ శిబిరాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, సభ్యులు క్రిష్ణమూర్తి, కోచ్‌లు గోపాలకృష్ణ, ఎండి.మన్నాన్, సీనియర్ క్రీడాకారుడు ఆబిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

31 పరుగులతో మహబూబ్‌నగర్ విజయం..

కోచింగ్ క్యాంప్ సీనియర్ విభాగం మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 31 పరుగుల తేడాతో గద్వాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 216 పరుగులు చేసింది. జట్టులో గణేష్ 67, హర్ష 45, డేవిడ్ 33 పరుగులు చేసి రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గద్వాల జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 185 పరుగులు చేసింది. జట్టులో అరవింద్ 54, శరత్ 30, జైసింహ 25 పరుగులు చేశారు.

పీఎస్‌లకు 146 వీల్‌చైర్స్ పంపిణీ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లోక్‌సభ ఎన్నికలలో భాగంగా మహబూబ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 275 పోలింగ్ కేంద్రా (పీఎస్)లకు అధికారులు 146 వీల్‌చైర్స్ పంపిణీ చేశారు. ఈనెల 13న పోలింగ్ ఉన్నందున దివ్యాంగుల కోసం వీటిని ఉపయోగించనున్నారు. జిల్లా కేంద్రంలోని బాదం రామస్వామి ఆడిటోరియం నుంచి శనివారం నోడల్ ఆఫీసర్ శివకుమార్ ఆధ్వర్యంలో వీటిని ఆయా సెక్టార్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో టీపీఓ లక్ష్మీపతి, మెప్మా సీఓ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల బంద్

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఈనెల 13న సాయంత్రం వరకు జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలు మూత పడనున్నాయి. పోలింగ్ జరుగుతున్న రోజు ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఉండటానికి ఎన్నికల నిబంధనల ప్రకారం 48గంటల పాటు లిక్కర్ షాప్‌లు మూయిస్తారు. కాగా ఒకవైపు పోలీసులు, మరోవైపు ఆబ్కారీ పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎక్కడి అక్కడ తనిఖీలు చేస్తున్నా ఆయా నియోజకవర్గాలకు మద్యం సరఫరా అవుతోంది. ప్రతిరోజు గ్రామాల వారీగా నాయకులు మద్యం, మాంసంతో విందు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని శాఖల అధికారులు ఉండే జిల్లా కేంద్రంలోనే ఏకంగా ఇళ్లలోనే మద్యం నిల్వలు ఉంచి ఓటర్లకు రాత్రి సమయంలో పంపిణీ చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ అక్రమ మార్గాల్లో ఇతర రాష్ట్రాల నుంచి సైతం మద్యం కాటన్లను భారీగా జిల్లాకు దిగుమతి చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా పక్కా సమాచారంతో గత నెల రోజులుగా ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి రూ. లక్షల విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హన్వాడ: గుడిమల్కాపూర్ శివారులో శనివారం అక్రమంగా ఇసుక తరలి స్తున్న ట్రాక్టర్‌ను హన్వాడ పోలీసులు పట్టుకున్నారు. నవాబ్‌పేట మండలం సాకల్‌పల్లితండాకు చెందిన శంకర్‌నాయక్ తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను గుడిమల్కాపూర్ వైపు తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. పట్టుబడిన ఇసుకను హన్వాడ ఠాణాకు తరలించి, ట్రాక్టర్ యజమాని శంకర్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జెండా తొలగింపుపై ధర్నా

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బంది కాషాయం జెండాలను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం సాయంత్రం బీజేపీ, హిందు సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో ధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా నాయకుడు కుర్వ రమేష్ జెండాలను తొలగించడం సరికాదన్నారు. విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి ఏఎస్ఐ వెంకటస్వామి చేరుకోని సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారం చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నాను విరమించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఉత్తరాదిమఠంలో శనివారం శ్రీపరుశరామ బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం సమావేశాన్ని నిర్వహించారు. అడహక్ కమిటీ ద్వారా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జోషి సంతోషాచార్య, ఉపాధ్యక్షులుగా సుదీంద్రాచార్య, రాఘువేందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జోషి ప్రదీపాచార్య, సహాయ కార్యదర్శిగా కొల్లూరు పవమానాచార్య, కోశాధికారిగా పరిమళాచార్య, సహాయ కోశాధికారిగా జయతీర్థచార్యలను ఎంపిక చేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్/దేవరకద్ర/అడ్డాకుల/చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం భూత్పూర్ చౌరస్తా, అమిస్తాపూర్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. భూత్పూర్ పట్టణానికి వంద ఇళ్లు నిర్మించి ఇస్తామని, చౌరస్తాలో ప్రతి ఆదివారం సంతలో వసూలు చేసే డబ్బులను ఇవ్వకుండా రద్దుచేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవీన్ గౌడ్, రూరల్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అడ్డాకుల మాజీ జడ్పీటీసీ రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి శనివారం గద్దెగూడెంలో ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సామాన్యుని పరిస్థితి మారుతుందని అన్నారు. మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. పలు గ్రామాలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అడ్డాకులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల తర్వాత బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో కనిపించరని అన్నారు. వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. అదేవిధంగా దమగ్నాపురంలో చేపట్టిన ప్రచారంలో వివిధ అంశాలపై ప్రజలకు వివరించారు. మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హన్మంత్ రెడ్డి, వట్టెం శివకుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమ ఫలాలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: బీఆర్ఎస్‌తోనే ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం అన్నాసాగర్‌లో గ్రామస్తులతో మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఓటు వేసి గెలిపించాలని సూచించారు. అదేవిధంగా అమిస్తాపూర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్‌ల మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దన్నారు. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌తో పాటు బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కౌన్సిలర్ రామకృష్ణ, బాలకోటి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, బాలస్వామి, ఆగిరి సత్యం, అజీజ్, జాకీర్, మహమూద్,శివరాజ్ ఉన్నారు.

రాజకీయాల్లో హుందాగా ప్రవర్తించాలి


మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

బాలానగర్: రాజకీయాల్లో హుందాగా ప్రవర్తించాలని.. వ్యక్తిగతంగా విమర్శిస్తే వారికే నష్టం జరుగుతుందని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రచ్చకట్ట వద్ద ఏర్పాటు చేసి కార్నర్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. బాలానగర్ నుంచి గంగాపూర్ వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే డబుల్ రోడ్డు మంజూరు చేయించి జీవో పత్రాలు సైతం తీసుకువస్తే ప్రస్తుత ఎమ్మెల్యే అన్ని అబద్దాలే మాట్లాడుతున్నాడని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలు గడిచినా హామీలు ఎందుకు నెరవేర్చడం లేదో చెప్పాలన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి యాదయ్య బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటచారి, నాయకులు పాల్గొన్నారు.

సొంతగూటికి చేరిన కౌన్సిలర్


బీఆర్ఎస్‌లో చేరుతున్న నర్సింలుకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పట్టణ 34వ వార్డ్ కౌన్సిలర్ కోట్ల నర్సింహులు శనివారం తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి తిరిగి రావడం సంతోషమని అన్నారు. మహబూబ్ నగర్ మండల పరిధిలోని లాల్యా నాయక్ తండాకు చెందిన కాట్రవత్ రాజు సైతం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రవి తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మాజీ సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్ శనివారం కోడూర్ ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ పి.నర్సిములు, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల పరిధిలోని చౌడూర్, కాకర్జాల్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డిల సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

సైన్స్‌ను జీవితానికి అన్వయించుకోవాలి


డీఈఓ రవీందర్‌తో ఉపాధ్యాయులు తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు సైన్స్‌ను నిజ జీవితానికి అన్వయించుకోవాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ కళాశాలలో కలాం డ్రీం ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా సైన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టగా.. చివరి రోజు అయిన శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సైన్స్‌ను పుస్తకాల్లో కాకుండా ప్రాక్టికల్ పద్ధతిలో సులువుగా నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సైన్స్ ప్రయోగాలతో పాటు విద్యార్థులకు సామాజిక అంశాలపట్ల అవగాహన పెంచే విధంగా చేపట్టిన కార్యక్రమాలు ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, కరుణాకర్, విజేత వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.